క్లుప్తంగా

పాఠశాలలకు బియ్యం, కిట్లు పంపిణీ



బలిజిపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటనాయుడికి కిట్ అందిస్తున్న ఎంఈఓ–2 శ్రీనివాసరావు

బలిజిపేట: పాఠశాలలకు సన్నబియ్యం, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బెల్టులు పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓ–2కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట ఉన్నత పాఠశాలలో కిట్లు, పుస్తకాలు ఉంచేందుకు ఒక స్టాక్‌పాయింట్‌ను ఏర్పాటుచేసి అక్కడి నుంచి పాఠశాలలకు క్లస్టర్లవారీగా వాటిని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల పాతరోల్‌ను అనుసరించి వచ్చిన వాటిని ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాలల వద్ద ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది ఎవరైనా ఉండి వాటిని తీసుకుని పాఠశాలలో భద్రపరచనున్నారన్నారు. పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులకు వాటిని పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

104 సంచార వాహనం తనిఖీ



మాట్లాడుతున్న మేనేజర్ కృష్ణ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో వైద్య సేవలందించే 104 వాహనాన్ని జిల్లా మేనేజర్ కృష్ణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చినభోగిలిలో వైద్యసేవలందిస్తుండగా వచ్చిన జిల్లా మేనేజర్ వాహనం శుద్ధి, మందుల లభ్యత, సంచారవాహనంలో ఉన్న ల్యాబ్ పరికరాల వినియోగం, ఏపీ రికార్డుల తయారీ విధానాన్ని పరిశీలించారు. 104 సంచార వాహనంలో వైద్యసేవలు పొందడానికి వచ్చిన రోగులతో మాట్లాడి రోగులకు అందుతున్న ఉచితవైద్య సేవలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ మురళి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సత్యవతి

సాలూరు: ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రతిభా అవార్డులు అందుకున్న పట్టణంలోని ప్రభుత్వ కళాశాలకు చెందిన బంగారుతల్లి, శ్యామ్‌లను ప్రిన్సిపాల్ సత్యవతి బుధవారం అభినందించారు. ఆ ఇద్దరు విద్యార్థులు ఇటీవల మంత్రి లోకేష్ చేతుల మీదుగా రూ.20వేల నగదు పురస్కారం, అవార్డు, ప్రశంసాపత్రాలను అందుకున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. జీవితంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహన చోదకులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

సీతానగరం: మండలంలోని వాహన చోదకులు రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని హనుమాన్ జంక్షన్ వద్ద బుధవారం ఆయన వాహనాలను తనిఖీ చేసి రోడ్డు భద్రత నియమాలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటో సోదరులంతా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతను పాటించాలని కోరారు. ద్విచక్ర వాహన చోదకులందరూ హెల్మెట్‌లు ధరించాలని, వాహనాలను సంబంధించిన డాక్యుమెంట్స్ విధిగా దగ్గర ఉంచుకోవాలని, కార్లున్న వారంతా డ్రైవింగ్‌చేసే సమయంలో సీట్‌బెల్ట్ విధిగా ధరించాలని సూచించారు. అలాగే వాహన చోదకులు మద్యం తాగి డ్రైవింగ్ చేయడం నేరమని, మద్యం తాగిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, అలా ఎవరైనా వాహనాలు ఇచ్చి ప్రమాదాల బారిన పడినా డ్రైవింగ్ చేసే వారితో పాటు వాహన యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఏఎస్సై ఎల్ శ్రీనివాసరావు, హెచ్‌సీ తిరుపతి రావు, సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

సీతంపేట: లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో మండల కేంద్రంలో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై జూలై 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక చట్టాలన్నీ రద్దు చేసిందన్నారు. ఇప్పటికే దేశంలో కనీస వేతనాల చట్టం అమలు కాక కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు.

నాణ్యమైన విత్తనాల ఎంపిక అవసరం

బలిజిపేట:

తొలకరి వర్షాలు ప్రారంభమయ్యాయి. రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. విత్తనాలు కొనేందుకు రెడీ అవుతున్న రైతులు తప్పనిసరిగా వాటిపై దృష్టిసారించి మంచి నాణ్యమైన విత్తనాల కొనుగోలుపై దృష్టిసారించాల్సి ఉందని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు

- వ్యవసాయశాఖ గుర్తించి లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. రశీదు తీసుకోవాలి రశీదుమీద ప్యాకెట్, ల్యాబ్ నంబర్ ఉన్నదీ లేనిది చూడాలి. -విత్తనాలు సాగుచేసేటప్పుడు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలి. దీనివల్ల తెగుళ్ల వ్యాప్తిని అరికట్టవచ్చు
- విత్తనాలు కొనుగోలు చేశాక మొలక శాతం పరీక్షించాలి మొలకశాతం 80ఉండాలి. లేకపోతే విత్తనాలు నాసిరకంగా గుర్తించి వెనక్కి ఇవ్వాలి
- పొలంలో విత్తనాలు వేసిన నాటి నుంచి పంట ఇంటికి వచ్చే వరకు విత్తనాలకు సంబంధించిన రశీదులు దగ్గర ఉంచుకోవాలి. రైతుకు ఏదైనా నష్టం జరిగితే అవి ఉపయోగపడతాయి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయరాదు





సిద్ధం చేసిన పొలం, (ఇన్‌సెట్లో) షాపుల్లో విక్రయాలకు సిద్ధంగా ఉన్న విత్తనాలు

గడువుదాటితే కొనుగోలు వద్దు

కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్, సీసా, డబ్బాపై సీల్ ఉందా? లేదా అన్నది నిర్ధారించుకోవాలి

- అరువు పద్ధతిలో కొనుగోలు చేసినప్పటికీ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలి

మంచి విత్తనాలు నారుపోయాలి

రైతులు సొంతంగా తయారుచేసిన విత్తనాలు నారు పోయడానికి శ్రేయస్కరం. ఒకవేళ కొనుగోలు చేస్తే మంచి విత్తనాలను కొనుగోలు చేసుకోవాలి. నారుపోసేముందు వాటి మొలకశాతం గుర్తించి నారుపోయాలి. నకిలీ విత్తనాలను కొనుగోలుచేసి మోసపోవద్దు. ఎటువంటి సమస్యలు ఉన్నా వ్యవసాయశాఖను సంప్రదించాలి.

– శ్రావణ్, ఏఓ, బలిజిపేట

జగన్నాథస్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు

బలిజిపేట: జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా బలిజిపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ అలంకరణ నిమిత్తం కళావిసర్జన కార్యక్రమాన్ని అర్చకుడు జేబీ హరికృష్ణమాచార్య స్వామి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బి.శ్రీధర్ నాగరాజ్ దంపతుల సమక్షంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జగన్నాథ రథోత్సవంలో భాగంగా సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి వారి మూర్తులకు తదుపరి ఉత్సవ అలంకరణ నిమిత్తం కళావిసర్జన చేశారు. ఇందులో భాగంగా విష్వక్సేన పూజ, భగవత్ పుణ్యాహవచనం పరిషత్, రక్షా సూత్రధారణ, మూర్తి, కళాకుంభవాహనలు, పాంచరాత్రాగమశాస్త్ర ప్రమాణంగా అర్చకులు స్వామి వారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు హరికృష్ణమాచార్యులతో పాటు ఆర్.పార్థసారథాచార్యస్వామి, సురేష్ స్వామి పాల్గొన్నారు.



బలిజిపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

రేషన్ సరఫరా వాహనాలను పునరుద్ధరించాలి

బలిజిపేట: రేషన్ సరుకులు సరఫరా చేసే ఎండీయూ వాహనాలను పునరుద్ధరించి రేషన్ బియ్యం, ఇతర సరుకులు లబ్ధిదారులకు ఇంటివద్దనే అందేలా చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు ఆర్.వేణు, మండల కార్యదర్శి మన్మథరావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎండీయూ వాహనాల రద్దుకు నిరసనగా బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి తహసీల్దార్ రత్నకుమారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఎండీయూ వాహనాల రద్దు నిర్ణయం ఉపసంహరించుకుని వాహనాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిర్వహణ లోపాలను దిద్దుబాటు చేసి వ్యవస్థను మరింత బలోపేతం చేయకుండా అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని రద్దుచేసి వాహన యజమానులను, దానిపై ఆధారపడి ఉండే వారిని నడిరోడ్డు మీదకు నెట్టివేయడం సమంజసంగా లేదన్నారు. రేషన్ బియ్యం అమ్ముకుంటున్నారనే నెపంతో దొడ్డితోవన నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడాన్ని సీపీఎం వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుంటాయి కానీ నగదు బదిలీ పథకం ద్వారా ఇచ్చే డబ్బు మాత్రం పెరగదన్నారు. అందువల్ల రేషన్ సరుకులే నిరుపేదలకు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.సత్యనారాయణ, బి.భానుమూర్తి, యు.లక్ష్మి, బలరాంనాయుడు, ఎండీయు వాహనాల మండల నాయకులు రవి, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

యువజన విభాగం మండల అధ్యక్షుడిగా లక్ష్మణరావు

- నియమించిన వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం

బలిజిపేట:



లక్ష్మణరావు

వైఎస్సార్‌సీపీ బలిజిపేట మండల యువజన విభాగం అధ్యక్షుడిగా రణధీర్ లక్ష్మణరావును నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ శాసనసభ్యుడు అలజంగి జోగారావు సూచనలతో మండల యువజన విభాగం అధ్యక్షుడిగా లక్ష్మణరావును నియమించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగారావు లక్ష్మణరావుకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొని పార్టీని అభివృద్ధి చేయాలని సూచించారు. లక్ష్మణరావుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలియజేశారు.

పార్వతీపురం యువజన విభాగం అధ్యక్షుల నియామకం



అప్పలనాయుడు, సంతోష్ కుమార్

పార్వతీపురం రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పురపాలక సంఘం పరిధి, మండల పరిధిలో యువజన విభాగం అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పార్వతీపురం పట్టణ యువజన విభాగం అధ్యక్షుడిగా బీఎస్ సంతోష్ కుమార్, పార్వతీపురం మండల యువజన విభాగం అధ్యక్షుడిగా ఉరిటి అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారికి మాజీ శాసనసభ్యుడు అలజంగి జోగారావు శుభాకాంక్షలు తెలియజేస్తూ పార్టీ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

పార్వతీపురం రూరల్:

మండలంలోని బాలగుడబ గ్రామంలో శ్రీకాకుళం జిల్లా రాగోలు ప్రాంతానికి చెందిన జెమ్స్ ఆస్పత్రి యాజమాన్యం సహకారంతో కమ్యూనిటీ పారామెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగిరెడ్డి సింహాచలం, నడిమింటి గోపాలనాయుడు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా తనిఖీలు నిర్వహించనున్నారని, అవసరమైన రోగులకు మందులు ఉచితంగా సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా జగన్నాథ స్వామి కళ్లు కడిగే కార్యక్రమం



అర్చకులు నిర్వహిస్తున్న కార్యక్రమం

సాలూరు: జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా జగన్నాథ స్వామికి కళ్లు కడిగే కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ మేరకు సాలూరు జమిందార్ సన్యాసిరాజు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలు లేకుండా చూడండి

- కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఈ ఏడాదిలోనైనా విద్యార్థుల మరణాలు లేకుండా తగు చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం నియోజకవర్గం ఇన్‌చార్జ్ బత్తిన మోహన్ రావు మాట్లాడుతూ గురువారం నుంచి విద్యా సంవత్సరం మొదలుకానున్న నేపథ్యంలో ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులు రోగాల సీజన్‌లో అనారోగ్యానికి గురికావడం సాధారణమైపోయిందన్నారు. వారిలో కొంతమంది మృత్యువాత పడే సంఘటనలు కూడా జిల్లాలో ప్రతి ఏటా నమోదవుతున్నాయన్నారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్, పచ్చకామెర్లు, పాము కాట్లు తదితరాల వల్ల చదువు కోసం వచ్చిన విద్యార్థులు తమ నూరేళ్ల జీవితాన్ని అర్ధాంతరంగా ముగిస్తున్నారని, దీనికి ప్రధాన కారణం సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ముందస్తుగా చర్యలు తీసుకోకపోవడమేనని ఆరోపించారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను వేధిస్తున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతి వసతిగృహంలోను ఏఎన్ఎంను నియమించి వైద్య సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, సిరిసిపిల్లి సాయి శ్రీనివాస్, తీళ్ల గౌరీ శంకరరావు, గేదెల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆస్పత్రుల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

- సీపీఎం డిమాండ్

పార్వతీపురం రూరల్: జిల్లావ్యాప్తంగా వైద్యఆరోగ్య కేంద్రాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి మౌలిక వసతుల కల్పన, పెరుగుతున్న రోగులకు అనుగుణంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతి ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున గిరిజన ప్రాంతాల్ల మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు ఉధృతమయ్యాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏరియా ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగిందని, పెరిగిన అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులు లేవని తమ పరిశీలనలో తెలిసిందన్నారు. జిల్లా ప్రజలు ప్రధానంగా ప్రభుత్వ వైద్యంపైనే ఆధార పడుతున్నారని, నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తాత్కాలిక ప్రాతిపదికన తక్షణమే బెడ్స్ ఏర్పాటు చేయాలని సరిపడినన్ని మందులు నిల్వ ఉంచాలని ఈ సందర్భంగా కోరారు. గరుగుబిల్లి మండలంలోని పెద్దూరు, జియ్యమ్మ వలస మండలంలోని గడసింగపురం గ్రామాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై వైద్యారోగ్య శాఖ తక్షణమే ప్రత్యేక బృందాల ద్వారా పరిశీలనచేసి నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు బీవీ రమణ, గొర్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: సార్వత్రిక విద్యాపీఠం 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ బి.రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లకు ఈనెల 12నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించి జూలై 30వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. జూలై 31న ప్రవేశ రుసుం చెల్లించాలని, ప్రవేశాలు పొందాలను కునేవారు తమ సమీపంలోని ఏఐ కోఆర్డినేటర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

పార్వతీపురం రూరల్: మండలంలోని సూడిగాం గ్రామ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ రాజకీయ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్.లోకేష్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకుని విధుల్లో నుంచి తొలగించాలని కోరుతూ గతంలో సూడిగాం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన అరంగి వినోద్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం స్థానిక గ్రామస్తులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పరమైన సేవలు అందిస్తూ టీడీపీ అంతర్గత పార్టీ సమావేశంలో పాల్గొని, ఉత్తమ కార్యకర్తగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న ఫీల్డ్ అసిస్టెంట్ లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనడం నేరం

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ సేవలు అందించే వ్యక్తి రాజకీయ పార్టీల కార్యక్రమంలో పాల్గొనడం నేరం. అయితే ఆ ఉద్యోగికి పార్టీ ఉత్తమ కార్యకర్తగా ప్రశంస పత్రాన్ని అందజేయడం మరో నేరం. గౌరవ వేతనం పొంది ప్రజలకు ప్రభుత్వం ద్వారా సేవలు అందించే ఉద్యోగులను ఈ విధంగా పార్టీ కార్యక్రమాల్లో ఉపయోగించడం సరికాదు. ఉద్యోగుల పై రాజకీయ ఒత్తిళ్లు చేయడం, అక్రమంగా తొలగించడం సరికాదు. ఇదివరకు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో వివిధ పార్టీలకు చెందిన వారనే నెపంతో అక్రమంగా తొలగించిన 8 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి. లేదా మీ ఉత్తమ కార్యకర్త ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల్లో నుంచి తొలగించాలి.

–ఎం.కృష్ణమూర్తి ప్రజా సంఘాల నాయకుడు

విత్తనాల కోసం 30 కిలోమీటర్ల ప్రయాణం

- గిరిజన రైతుల దుస్థితి

సాలూరు రూరల్: మండలంలోని హిల్‌టాప్ గిరిజన ప్రజల కష్టాలు అన్నీఇన్నీ కావు. కూటమి ప్రభుత్వ పాలన తీరుతో గిరిజనులకు ఒక దాని తరువాత మరో సమస్య ఎదురవుతోంది. నిన్న ఎండీయూ వాహనాలు రద్దు చేసి రేషన్ డిపోకు వెళ్లి కిలోమీటర్ల దూరం భుజాలపై రేషన్ బియ్యం మోసుకుని రావాల్సిన దుస్థితి కల్పించిన కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో రైతుభరోసా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉంచాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా అల్లంతదూరంలో మీ విత్తనాలు ఉన్నాయి తెచ్చుకోండంటూ ఏజెన్సీ ప్రాంత రైతులు పట్టణంలో ఉన్న అర్బన్ రైతు భరోసా కేంద్రంలో విత్తనాలు తీసుకోవాల్సిన పరిస్థితి కల్పించింది. సాలూరు మండలంలోని కరడవలస గ్రామానికి చక్కనైన రహదారి గత ప్రభుత్వంలో మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర చొరవతో నిర్మాణం జరిగింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అక్కడ కంటైనర్ ఆస్పత్రి ఏర్పాటుకు గత ప్రభుత్వంలో వేసిన రోడ్డు ఒక అవకాశం కల్పించిందనే చెప్పవచ్చు.



సాలూరు అర్బన్ రైతు భరోసా కేంద్రం

చక్కనైన బీటీ రోడ్డు ఉన్న ఈ గ్రామానికి కనీసం రైతులకు అవసరమైన విత్తనాలు దగ్గరకు అందించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందంటే గిరిజన శాఖ మంత్రి ఉన్న గిరిజన నియోజకవర్గంలో గిరిజన రైతులకు సేవలు ఏమేరకు అందుతున్నాయో ప్రస్తుత పరిస్థితులను బట్టి అర్థం చేసుకోవచ్చు. జిల్లేడువలస పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో వరి విత్తనాలు ఉంచాల్సి ఉండగా సాలూరు అర్బన్ రైతుభరోసా కేంద్రంలో విత్తనాలు నిల్వ ఉంచారు. జిల్లేడువలస గ్రామ ప్రజలు కూడా సాలూరు అర్బన్ రైతు భరోసా కేంద్రానికి వచ్చి విత్తనాలు తీసుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారులు విత్తనాలు అందుబాటులో ఉంచాలని గిరిజన రైతులకు కోరుతున్నారు.



రేషన్ బియ్యం మోసుకుని వెళ్తున్న గిరిజన మహిళ

రోడ్డు ఉన్న గ్రామంలోనూ ఇవ్వకపోతే ఎలా?

గిరిజన గ్రామాల్లో రోడ్డు సౌకర్యం లేని గ్రామానికి విత్తనాలు అందిచకపోయినా కనీసం రోడ్డు సౌకర్యం ఉన్న కరడవలస గ్రామానికి విత్తనాలు అందించాలి. ఇప్పటికే 30 కిలోమీటర్లు వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాల్సి వస్తోంది. ఇప్పుడు విత్తనాలు కూడా ఇలాగే తీసుకోవాలంటే కష్టం.

జి.శంకర్రావు గిరిజన రైతు కరడవలస

ఇన్‌చార్జ్ డీఈఓను సస్పెండ్ చేయాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్



డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పార్వతీపురం రూరల్:

జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారిని సస్పెన్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్, విద్యార్థి సంఘాల నాయకులు డీఈఓ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థల్లో అక్షరాలా లక్షల వ్యాపారం జరుగుతోందని, పుస్తకాలు యూనిఫాం, బెల్ట్, పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులు జేబులు ఖాళీ చేస్తున్న క్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వెళ్లి అక్రమాలను అడ్డుకుని విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇస్తే విద్యాశాఖ అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. కార్పొరేట్ కబంధహస్తాల్లో జిల్లా విద్యాశాఖ అధికారులు ఉన్నారా? అని ఆయన ప్రశ్నించారు. పేద విద్యార్థుల పక్షాన ఉండవలసిన అధికారులు కార్పొరేట్ కబంధహస్తాల్లో ఉండడం చాలా బాధాకరమన్నారు. నిర్లక్ష్యంగా ఉన్న అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు. లేని పక్షంలో సోమవారం కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలి



మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సాలూరు: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలను పెంచాలన్న ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 15 తరువాత ఏ రోజునుంచైనా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ, పురపాలక సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు రూ.15 వేలు మాత్రమే జీతం ఇస్తున్నారన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరల నేపథ్యంలో ఈ జీతాలతో ఆ కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకుడు సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.